సాక్షి
ఒడిశా

బుధవారం । 5 । జూన్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,81,096లు, బంగారం 3 గ్రాముల 500 మిల్లీగ్రాములు, 8 గ్రాముల 750 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

సత్తాచాటిన వారసురాల్లు

రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల పోటీలో ప్రముఖ నాయకుల కుమార్తెలు విజేతలుగా నిలిచారు.

- 2లో



కొరాపుట్‌లో పుంజుకున్న కాంగ్రెస్

కొరాపుట్ జిల్లాలో 2019 ఎన్నికల ఫలితాలతో పోల్చితే ప్రస్తుత ఫలితాల్లో కాంగ్రెస్ పుంజుకుంది.

- 2లో



న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో ప్రసాద్ మృతదేహం

రాయగడ: స్కూటీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో స్కూటీ నడుపుతున్న వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. జిల్లాలోని గుడారి మెయిన్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి గుడారికి చెందిన దుర్గా ప్రసాద్ పాడి(34)గా గుర్తించారు. స్కూటీపై కళాశాలకు వెళ్తుండగా మెయిన్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురైన ప్రసాద్‌ను పద్మపూర్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ప్రసాద్ మృతి చెందినట్లు ప్రకటించారు. దీనిపై గుడారి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్‌డ్యామ్‌లో మునిగి బాలుడి దుర్మరణం



బాలుడి మృతదేహం

జయపురం: చెక్‌డ్యామ్‌లో బాలుడి పడి దుర్మరణం పాలైన ఘటన కొరాపుట్ జిల్లా దసమంతపూర్ సమితి ఛండీ జానిగుడ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సుబ్రు మినియక తన పొలానికి వెళ్లాడు. అతడితో పాటు అతడి కుమారుడు హిరజ్ మినియక(7), ఆ గ్రామానికి చెందిన సేబక్ జాని కుమారుడు లిపుణ్ జాని(5)లు కూడా వెళ్లారు. అక్కడ ఎండవేడి ఎక్కువగా ఉండడంతో ఇద్దరు చిన్నారులు స్నానం చేసేందుకు సమీపంలో చెక్ డ్యామ్ వద్దకు వెళ్లి జారిపడ్డారు. డ్యామ్‌లో నీరు ఎక్కువగా ఉండడంతో వారు బయటకు రాలేకపోయారు. అది చూసిన సుబ్రు మినియాక వెంటనే ఆ ప్రాంతంలో ఉన్నవారిని పిలిచి ఆ ఇద్దరినీ రక్షించేందుకు ప్రయత్నించారు. స్థానికుల సాయంలో ఇద్దరు చిన్నారులను బయటకు తీశారు. వెంటనే దసమంతపూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిని పరీక్షించిన డాక్టర్లు హిరజ్ మృతి చెందాడని ప్రకటించారు. మరో బాలుడు లిపుణ్ జానికి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ సహద్ లక్ష్మణ్ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించామని దసమంతపూర్ పోలీసు అధికారి రవీంద్రనాథ్ బొడకుమార్ వెల్లడించారు. బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

ప్రజలకు రుణపడి ఉంటాను

- కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక



మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి ఉలక

రాయగడ: ఎంతో ఆదరణతో, అభిమానంతో కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి వరుసగా రెండోసారి గెలిపించిన ప్రజలందరికీ తాను రుణపడి ఉంటానని కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి ఉలక అన్నారు. తన సమీప బీజేడీ అభ్యర్థి కౌసల్య హికకపై 1,29,394 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన తర్వాత ఆయన విలేకరుతో మాట్లాడారు. తాను మొదటిసారి ఈ స్థానం నుంచి విజయం సాధించి ఈ ప్రాంత సమస్యలపై పోరాడానని గుర్తు చేశారు. అదేవిధంగా ఎల్లవేళలా ప్రజలతో సత్సంబంధాలతో వ్యవహరించడంతో తనకు మరోసారి ప్రజలు ఆదరించారన్నారు. ఇకపై తాను సమస్యల పరిష్కారంపై పోరాడేందుకు మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా రాయగడ వంటి ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

24 గంటల్లో వడదెబ్బతో నలుగురు మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో గత 24 గంటల్లో వడదెబ్బ కారణంగా మరో 4 మంది మరణించినట్లు ప్రభుత్వం ధ్రువీకరించింది. దీంతో ఈ వేసవిలో రాష్ట్రంలో మొత్తం 34 మంది వడదెబ్బతో మరణించినట్లు ఖరారు అయింది. మంగళవారం ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) సమాచారం ప్రకారం కలెక్టర్లు పలు ప్రాంతాల నుంచి మొత్తం 149 సందిగ్ధ వడదెబ్బ మరణ కేసులను నివేదించారు. వాటిలో 34 మంది వడదెబ్బ బాధితులుగా నిర్ధారించబడినట్లు పేర్కొన్నారు.

కమల వికాసం

- రాష్ట్రంలో బీజేపీ విజయకేతనం
- సుదీర్ఘ బీజేడీ పాలనకు తెర
- 78 స్థానాల్లో సత్తాచాటిన కమలం పార్టీ



భువనేశ్వర్:

రాష్ట్రంలో సుదీర్ఘ బీజేడీ పాలనకు తెరపడింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించింది. ఉభయ లోక్‌సభ, శాసనసభ పోటీల్లో సత్తా చాటింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఢోకా లేకుండా మెజారిటీ సీట్లు సాధించింది. మంగళవారం జరిగిన లెక్కింపులో 21 లోక్‌సభ స్థానాలకు గాను 20 స్థానాలను బీజేపీ, కాంగ్రెస్ 1 స్థానంలో గెలిచాయి. అలాగే శాసనసభకు జరిగిన లెక్కింపులో బీజేపీ 78 స్థానాలు, బీజేడీ 51 స్థానాలు, కాంగ్రెస్ 14 స్థానాలు, స్వతంత్రులు 3, సీపీఎం 1 స్థానాలు సాధించారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రో, జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా, కేంద్ర మాజీమంత్రి ప్రతాప్ చంద్ర షడంగి, అపరాజిత షడంగి వంటి పలువురు బీజేపీ నేతలు సంబల్‌పూర్, పూరీ, కేంద్రాపడా, బాలాసోర్ మరియు భువనేశ్వర్ లోక్‌సభ స్థానాల్లో సత్తాచాటారు. 2019లో బీజేపీ ఒడిశాలో కేవలం 8 లోక్‌సభ, 23 అసెంబ్లీ స్థానాలను మాత్రమే గెలుచుకుంది.

ప్రజలకు ధన్యవాదాలు: గోలక్ మహాపాత్రో

రాష్ట్రంలో అత్యంత గొప్ప ఫలితాలు అందించిన ప్రజలకు భారతీయ జనతా పార్టీ నాయకుడు గోలక్ మహాపాత్రో ధన్యవాదాలు తెలిపారు. స్థానిక రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మద్దతు, కార్యకర్తల నిర్విరామ ప్రయత్నం ఇంతటి ఘన విజయానికి దోహదపడిందన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు స్పష్టమైన మెజారిటీని అందించినందుకు ఓటర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వివిధ రంగాల్లో ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించిన మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.

లోక్‌సభ ఫలితాలు

నియోజకవర్గం	విజేత	ప్రత్యర్థి	మెజారిటీ
భువనేశ్వర్	అపరాజిత షడంగి(బీజేపీ)	మన్మథ కుమార్ రౌత్రాయ్ (బీజేడీ)	35,070
అసికా	అనిత శుభదర్శిని(బీజేపీ)	రంజిత సాహు (బీజేడీ)	98,883
బాలాసోర్	ప్రతాప్ చంద్రషడంగి (బీజేపీ)	లేఖశ్రీ సామంత సింగార్ (బీజేడీ)	1,47,156
బర్‌గడ్	ప్రదీప్ పురోహిత్ (బీజేపీ)	ప్రణీత మిశ్రా (బీజేడీ)	2,51,667
బరంపురం	డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి (బీజేపీ)	భృగు బక్షిపాత్రో (బీజేడీ)	1,63,805
భద్రక్	అభిమన్యు సెఠి (బీజేపీ)	మంజులత మండల్ (బీజేడీ)	91,544
బొలంగీరు	సంగీత కుమారి సింగ్‌దేవ్ (బీజేపీ)	సురేంద్ర సింగ్ భొయి (బీజేడీ)	1,29,994
కటక్	భర్తృహరి మెహతాబ్ (బీజేపీ)	సంతృప్త మిశ్రా (బీజేడీ)	57,077
ఢెంకనాల్	రుద్ర నారాయణ పాణి (బీజేపీ)	అబినాష్ సామల్ (బీజేడీ)	76,567
జగత్‌సింగ్‌పూర్	బిభు ప్రసాద్ తొరై (బీజేపీ)	డాక్టర్ రాజశ్రీ మల్లిక్ (బీజేడీ)	40,696
జాజ్‌పూర్	రబీంద్ర నారాయణ బెహరా (బీజేపీ)	సర్మిష్ట సెఠి (బీజేడీ)	1,587
కలహండి	మాలవిక దేవి (బీజేపీ)	లంబోదర్ నియాల్ (బీజేడీ)	1,33,813
కంధమల్	సుకాంత కుమార్ పాణిగ్రాహి (బీజేపీ)	అచ్యుత్ సామంత్ (బీజేడీ)	21,371
కేంద్రాపడా	బైజయంత్ పండా (బీజేపీ)	అంశుమాన్ మహంతి (బీజేడీ)	66,536
కెంజొహర్	అనంత నాయక్ (బీజేపీ)	ధనుర్జయ సిద్ధు (బీజేడీ)	97,042
కొరాపుట్	సప్తగిరి శంకర్ ఉలాకా (కాంగ్రెస్)	కౌసల్య హికాకా (బీజేడీ)	1,47,744
మయూర్‌భంజ్	నబచరణ్ మాఝి (బీజేపీ)	సుదాం మరాండి (బీజేడీ)	2,19,032
నవరంగపూర్	బలభద్ర మాఝి (బీజేపీ)	ప్రదీప్ కుమార్ మాఝి (బీజేడీ)	87,536
పూరీ	సంబిత్ పాత్రో (బీజేపీ)	అరూప్ మోహన్ పట్నాయక్ (బీజేడీ)	1,04,709
సంబలపూర్	ధర్మేంద్ర ప్రధాన్ (బీజేపీ)	ప్రణబ్ ప్రకాష్ దాస్ (బీజేడీ)	1,19,836
సుందరగడ్	జుయల్ ఓరాం (బీజేపీ)	దిలీప్ కుమార్ టిర్కీ (బీజేడీ)	1,38,808

కల చెదిరింది




భువనేశ్వర్: బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, రాష్ట్ర దీర్ఘకాల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కల చెదిరింది. ఆయన జాతీయ స్థాయిలో దీర్ఘకాలిక ముఖ్యమంత్రిగా వరుసగా 6వసారి పాలనా పగ్గాలు చేపడతానని కన్నకలలు చెదిరాయి. ఊహాతీతమైన ఎన్నికల ఫలితాలు బీజేడీ దుర్గం పట్టు సడలిన సంకేతాల్ని జారీ చేస్తున్నాయి. ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగిడి అపజయం మాట ఎరుగని నవీన్ పట్నాయక్‌కు ఈ వైపరీత్యం ఎదురవుతుందని అనుకోలేదు. ఆయన పోటీ చేసిన ప్రతిచోట గెలిచే ఏకైక నాయకునిగా వెలిగొందారు. మంగళవారం నాటి తాజా ఫలితాలు ఈ ఏక ఛత్రాధిపత్యానికి తెర దించాయి. రాష్ట్ర రాజకీయాల్లో నవీన్ శకం అంతిమ దశ వైపు అడుగులు వేసే పరిస్థితి ఆవహించిందనే వ్యాఖ్యలు బీజేడీయేతర శిబిరాల నుంచి మారుమోగుతున్నాయి. రాష్ట్రంలో 2 దశాబ్దాల పైబడిన సుదీర్ఘ ప్రాంతీయ పార్టీ పాలన మరుగున పడి జాతీయ పార్టీ పాలన పగ్గాలు చేపట్టనుంది. దీర్ఘకాలం తర్వాత రాష్ట్రంలో జాతీయ పార్టీ అధికారంలోకి రానుంది. ఈసారి జరిగిన ఎన్నికల్లో ఆయన ఒకేసారి 2 స్థానాల నుంచి పోటీ చేశారు. గంజాం జిల్లా హింజిలి తన సొంత నియోజకవర్గం కాగా కంటాబంజి నుంచి కూడ పోటీ చేశారు. సొంత నియోజకవర్గంలో ఓటర్లు పట్టం గట్టినా, కంటాబంజి ప్రాంతీయులు ఆయనను నిరాకరించిన రీతిలో తీర్పుని వెల్లడించారు. కంటాబంజి నియోజకవర్గంలో తనతో ప్రత్యక్షంగా తలపడిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి లక్ష్మణ్ బాగ్ 16,321 ఓట్ల ఆధిక్యంతో విజేతగా నిలిచారు. బాగ్ 90,594 ఓట్లు సాధించగా నవీన్ పట్నాయక్ 74,273 ఓట్లని మాత్రమే కూడగట్టుకోగలిగారు. గంజాం జిల్లా హింజిలి నియోజకవర్గం నుంచి సామాన్య ఆధిక్యతతో నవీన్ పట్నాయక్ యథాతథంగా విజయం సాధించారు. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన శిశిర్ కుమార్ మిశ్రాపై స్వల్పంగా 4,649 ఓట్ల తేడాతో గెలిపొందారు. 66,358 ఓట్లతో హింజిలి నుంచి నవీన్ పట్నాయక్ విజేతగా నిలిచారు.

పెరిగిన నరేంద్ర సరోవరం మృతుల సంఖ్య

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని చందన్ యాత్ర సందర్భంగా స్థానిక నరేంద్ర సరోవరం తీరంలో సంభవించిన బాణాసంచా పేలుడులో మృతుల సంఖ్య పెరుగుతోంది. తాజా నివేదిక ప్రకారం ఈ ఘటనలో కాలిన గాయాలతో మరో వ్యక్తి మృతి చెందినట్లు మంగళవారం ప్రకటించారు. దీంతో మృతుల సంఖ్య 14కు చేరుకుందని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. మరో 13 మంది క్షతగాత్రులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. మృతుల బంధువులకు ఒక్కొక్కరికీ రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు పూరీ జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుంటారు.

అద్భుతమైన విజయం

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ఎన్నికల చరిత్రను లిఖించే దశలో ఉన్నందున, సుపరిపాలనకు మరియు రాష్ట్ర విశిష్ట సంస్కృతి పరిరక్షణకు ఇది అద్భుతమైన విజయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల కలలను నెరవేర్చడంతో పాటు ఒడిశాను పురోగతిలో కొత్త శిఖరాలకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలందరి ప్రయత్నాలకు గర్వపడుతున్నానని వెల్లడించారు.

మల్కన్‌గిరిలో మిశ్రమ ఫలితాలు



నర్సింగ్ మద్కమి



మంగు ఖీలో

మల్కన్‌గిరి: జిల్లాలో మంగళవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మల్కన్‌గిరి నియోజకవర్గంలో బీజేపీ గెలుపు సాధించగా, చిత్రకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించింది. మల్కన్‌గిరి నియోజకవర్గం నుంచి బీజేపీ పార్టీ తరుపున నర్సింగ్ మద్కమి, బీజేడీ తరుపున మానస్ మద్కమి, కాంగ్రెస్ పార్టీ నుంచి మాల్లమాడీ పోటీ చేశారు. వీరిలో బీజేపీకి 77,763 ఓట్లు, కాంగ్రెస్‌కి 63,298 ఓట్లు, బీజేడీకి 34,082 ఓట్లు వచ్చాయి. దీంతో బీజేపీ అభ్యర్థి నర్సింగ్ మాద్కమి 14,465 ఓట్లు మెజారిటీతో విజయం సాధించారు. అదేవిధంగా చిత్రకొండ నియోజకవర్గంలో బీజేపీ బీజేపీ తరుపున డొంబురు సీసా, బీజేడీ తరుపున లక్ష్మీప్రియ నాయిక్, కాంగ్రెస్ పార్టీ తరుపున మంగు ఖీలో పోటీలో నిలిచారు. అయితే ఈ ఫలితాల్లో మంగు ఖీలో 9,398 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

వాటర్ ట్యాంకర్‌లో గంజాయి రవాణా



పట్టుబడిన గంజాయి మూటలతో నిందితులు

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ పోలీసులు ఒక వాటర్ ట్యాంకర్‌లో రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నారు. బొయిపరిగుడ పోలీసు అధికారి గీతాంజలి ప్రధాని తెలిపిన వివరాల మేరకు.. గంజాయి అక్రమ రవాణాపై బొయిపరిగుడ పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక వాటర్ ట్యాంక్‌ను ఆపి తనిఖీలు నిర్వహించారు. వాటర్ ట్యాంక్ లోపల 390 గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ట్యాంకర్ యజమానితో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయిని మేజిస్ట్రేట్ సమక్షంలో తూయించగా 1,975 కేజీలు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. నిందితుల నుంచి 4 సెల్‌ఫోన్లు, ఒక ఆధార్ కార్డు, ఒక గుర్తింపు కార్డు, రూ.9 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులు ఝార్ఖాండ్ రాష్ట్రానికి చెందిన సయ్యద్ హుసేన్, సయ్యద్ సాదీన్, రామకుమార్ సింగ్‌లుగా గుర్తించారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 20.300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం అందుకున్న పోలీసులు ఈ మేరకు చంద్రపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని గండేసి గ్రామంలో తనిఖీలు చేపట్టగా గంజాయితో ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టుకు తరలించారు.



రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితుడు



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లు



గంజాయితో పట్టుబడిన ట్యాంకర్

రాయగడలో ఉనికి చాటుకున్న కాంగ్రెస్




గుణుపూర్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



విలేకరులతో మాట్లాడుతున్న సత్యజీత్ గొమాంగో



అప్పలస్వామి కద్రక



నీలమాధవ హికక

రాయగడ: జిల్లాలోని రాయగడ, బిసంకటక్, గుణుపూర్ శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ తన ఉనికి చాటుకుంది. ఈ మూడు స్థానాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. రాష్ట్ర ఆదివాసీ హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ఘోర పరాజయం పొందారు. మూడోసారి ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో ఓటమి చవిచూశారు.

రాయగడలో...

రాయగడ శాసనసభ స్థానం నుంచి రెండోసారి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన అప్పలస్వామి కద్రక 29,782 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ స్థానం నుంచి పోటీ చేసిన బీజేడీ అభ్యర్థి అనసూయ మాఝికి 57,868 ఓట్లు అనుకూలంగా పోలవ్వగా, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కద్రకకు 87,650 ఓట్లు అనుకూలంగా పోలయ్యాయి. ఇదే స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన బసంత కుమార్ ఉలకకు 21,000 ఓట్లు పోలయ్యాయి.

బిసంకటక్‌లో...

జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన బిసంకటక్ శాసనసభ నుంచి పోటీ చేసిన మంత్రి జగన్నాథ సరక ఓటమి చవిచూశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఈ స్థానం నుంచి పోటీ చేసిన నీలమాధవ హికకకు 67,539 ఓట్లు, బీజేడీ అభ్యర్థిగా పోటీ చేసిన మంత్రి సరకకు 58,791 ఓట్లు, బీజేపీ నుంచి పోటీ చేసిన జగన్నాథ నుండ్రుకకు 42,109 ఓట్లు పోలయ్యాయి. మొత్తంగా కాంగ్రెస్ అభ్యర్థి నీలమాధవ హికక 9,403 ఓట్ల మెజారిటీతో గెలిపొందారు.

గుణుపూర్‌లో...

గుణుపూర్ శాసనసభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సత్యజీత్ గొమాంగోకు 77,637 ఓట్లు పోలవ్వగా, తన సమీప బీజేడీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగోకు 47,752 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి త్రినాథ్ గొమాంగోకు 21,808 ఓట్లు అనుకూలంగా పోలయ్యాయి. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి సత్యజీత్ 29,885 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు విజయోత్సవాల్లో పాల్గొన్నారు.



ఫలితాలను ఆసక్తిగా వింటున్న జనం

క్లుప్తంగా

విజయగణపతికి విశేష పూజలు



పూజలందుకుంటున్న విజయగణపతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు



సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్ : బలగలోని బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో మంగళవారం సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి పూజలు చేశారు.

భద్రమ్మ తల్లి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రమ్మతలి

శ్రీకాకుళం కల్చరల్: బలగ భద్రమ్మతల్లి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సేవకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ముర్రాట్లు సమర్పించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రిమ్స్ అన్నదాన పథకానికి విరాళం



విరాళం అందిస్తున్న భోజ్‌కుమార్

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో అమలవుతున్న అన్నపూర్ణ నిత్యాన్నదాన పథకానికి హయాతినగరానికి చెందిన కిల్లాన భోజ్‌కుమార్ తన కుమారుడు పెళ్లి రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళం మంగళవారం అందించారు. ఈ విరాళాన్ని సంఘం కార్యదర్శి ఫల్గుణరావుకు అందించారని సంఘ అధ్యక్షుడు గంగుల రమణబాబు, జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్ర రావు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాతపట్నం: పుస్తకం పఠనంతో మనోవికాసం కలుగుతుందని పాతపట్నం శాఖా గ్రంథాలయాధికారి కళ్ల రాజు అన్నారు. శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్విజ్, మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించాలన్నారు. చిన్నారులు విజ్ఞానంతో కూడిన ఆటలు ఆడాలన్నారు. ఉపాధ్యాయులు బి.బెనర్జీ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బూర్జ: ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బూర్జ ఎస్‌ఐ జి.వి.ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి విజయోత్సవ ర్యాలీలు, ఎదుట వ్యక్తులకు కించపరుస్తూ ప్రోగ్రామ్‌లు వంటివి నిర్వహించడానికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ వేడుకలను తమ వ్యక్తిగత ప్రదేశాల్లోనే నిర్వహించుకోవాలన్నారు. ప్రజాజీవనానికి ఇబ్బంది కల్పించవద్దని సూచించారు.

సత్తాచాటిన వారసులు



సోఫియా ఫిరదౌస్



ఉపాసన మహాపాత్రో

భువనేశ్వర్: రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల పోటీలో ప్రముఖ నాయకుల కుమార్తెలు విజేతలుగా నిలిచారు. వీరు తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేయడం విశేషం. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బారాబటి-కటక్ నియోజకవర్గం నుంచి సోఫియా ఫిరదౌస్, పూరీ జిల్లా బ్రహ్మగిరి స్థానం నుంచి బీజేపీ టికెటుతో ఉపాసనా మహాపాత్రో విజయం సాధించారు.

సిట్టింగ్ కాంగ్రెసు ఎమ్మెల్యే మహమ్మద్ మొకీం కుమార్తె సోఫియా ఫిరదౌస్, బీజేపీకి చెందిన గైనకాలజిస్ట్ పూర్ణచంద్ర మహాపాత్రోతో ముఖాముఖి తలపడి 8,001 ఓట్ల తేడాతో ఓడించి తండ్రి ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్‌కు సీటును కైవసం చేసుకుంది. ఆమెకు 53,339 ఓట్లు రాగా, ప్రత్యర్థి మహాపాత్రోకు 45,338 ఓట్లు వచ్చాయి. రుణ మోసం కేసులో మొకీంకు విధించిన శిక్షపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడంతో కాంగ్రెస్ ఆ స్థానం నుంచి సోఫియాను నామినేట్ చేసింది. 32 ఏళ్ల ఆమె సివిల్ ఇంజినీర్, రియల్ ఎస్టేట్ సంస్థ డైరెక్టర్. ఆమె గత సంవత్సరం భువనేశ్వర్ చాప్టర్ క్రెడియా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు.

ఇకపోతే ఉపాసన మహాపాత్రో మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే దివంగత నాయకుడు లలాటేందు బిద్యాధర్ మహాపాత్రో కుమార్తె. కోస్తా ఒడిశా పూరీ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని బ్రహ్మగిరి శాసన సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి, సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బీజేడీ అభ్యర్థి ఉమాకాంత సామంతరాయ్‌పై 9,830 ఆధిక్యత సాధించారు. ఆమెకి 95,783 ఓట్లు పోల్ కాగా, ప్రత్యర్థి ఉమాకాంత సామంత్రాయ్‌కు 85,953 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే భుజబల్ మాఝీ కుమార్తె, వృత్తిరీత్యా వైద్యురాలు అయిన లిపికా మాఝి, డాబుగాంవ్ బీజేడీ సిట్టింగ్ ఎమ్మెల్యే మనోహర్ రంధారి చేతిలో 21,455 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

పర్లాకిమిడి బీజేడీ సొంతం



దాశరథి గొమాంగో



మాట్లాడుతున్న రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని పర్లాకిమిడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి కోడూరు నారాయణరావుపై సుమారు 4,572 ఓట్ల తేడాతో గెలిపొందారు. స్థానిక ఎస్‌కేసీజీ కళాశాలలో ఉదయం 8.30 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమైంది. పర్లాకిమిడి అసెంబ్లీ స్థానానికి 28 రౌండ్లు ఈవీఎంలు లెక్కించడంతో ఆఖరి నిమిషం వరకూ ఉత్కంఠ కొనసాగింది. బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహికి 55,126 ఓట్లు లభించగా, బీజేపీ అభ్యర్థి కోడూరు నారాయణరావుకు 51,019 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి బిజయ కుమార్ పట్నాయిక్‌కు 34,852 ఓట్లు లభించాయి. దీంతో 4,572 ఓట్ల తేడాతో రూపేష్ పాణిగ్రాహి విజయం సాధించారు.

మోహనలో కాంగ్రెస్ పాగా

మోహనా నియోజకవర్గంలో మొత్తం 30 రౌండ్లు పూర్తి చేసుకునేసరికి కాంగ్రెస్ అభ్యర్థి దాశరథి గొమాంగోకు 61,818 ఓట్లు లభించగా, అంతర్యామి గొమాంగో (బీజేడీ)కి 47,105 ఓట్లు, ప్రశాంత్ కుమార్ మల్లిక్ (బీజేపీ)కి 57,537 ఓట్లు లభించినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ అభ్యర్థి దాశరథి గొమాంగో మోహనా (ఎస్టీ) స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి ప్రశాంత్‌పై 4,281 ఓట్ల ఆధిక్యతతో గెలిపొందినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



అప్పలస్వామి మృతదేహం

పర్లాకిమిడి: స్థానిక ఎస్‌కేసీజీ కళాశాల గ్రౌండ్స్‌లో ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో మైదానంలో డిజిటల్ ఎలక్షన్ బోర్డు మంగళవారం ఏర్పాటు చేశారు. అయితే మధ్యాహ్నం 3 గంటల సమయంలో పెద్ద ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. దీనిలో భాగంగా అక్కడ పిడుగు పడడంతో బొమ్మాళి అప్పలస్వామి (55) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. డిజిటల్ ఫలితాలు చూస్తుండగా ఆకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో రావడంతో అప్పలస్వామి ఒక చెట్టు కిందకు వెళ్లడంతో పిడుగుపాటుకు వెంటనే మృత్యువాత పడ్డాడు. మృతుడు అప్పలస్వామిది పర్లాకిమిడి 16వ వార్డు పెద్ద మాదిక వీధి అని ఆదర్శ పోలీసుస్టేషన్ ప్రశాంత్ భూపతి తెలియజేశారు. కలెక్టర స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌లు వెంటనే అంబులెన్స్‌కు ఫోన్‌చేసి మృతదేహాన్ని ప్రభుత్వ మెడికల్‌కు తరలించారు.

నేడు శ్రీముఖ సింగారం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన బలభద్రుడు, దేవీ సుభద్ర మరియు శ్రీజగన్నాథుడు దేవతాత్రయం శ్రీముఖ అలంకరణకు కార్యక్రమం ఖరారు అయింది. జ్యేష్ఠ కృష్ణ చతుర్దశి పురస్కరించుకుని బుధవారం మూల విరాటులకు శ్రీముఖ సింగార సేవ బొనాకొ లగ్గి నిర్వహించనున్నట్లు ఆలయ అధికార వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ద్వితీయ భోగ మండపం సేవ తర్వాత ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. సాయంత్రం 7.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు బొనాకొ లగ్గి సేవ కొనసాగుతుంది. ఈ వ్యవధిలో సుమారు 3 గంటలపాటు భక్తులకు దర్శనం నిలిపి వేయనున్నట్లు ఆలయ అధికార వర్గాలు ప్రకటించాయి.

పాతపట్నంలో వర్షం

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. అచ్యుతాపురం, ప్రహరాజపాలెం, కొదూరు, బూరగాం, గంగువాడ, కొరసవాడ, రొంపివలస, ఆర్.ఎల్.పురం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

రాయితీపై వరి విత్తనాలు



ఏపీ సీడ్స్ గొడౌన్‌లో ఉన్న వరి విత్తనాలు

- 1380 క్వింటాళ్ల పంపిణీకి ముందస్తు ప్రణాళిక
- రైతు భరోసా కేంద్రాల ద్వారా అందజేత

గార : ఖరీఫ్ సీజన్‌కు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే గార మండలంలో వరి పంట సాగు కోసం భూములు దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్నారు. మండల రైతాంగానికి వివిధ రకాలైన విత్తనాలు 1380 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు చేశారు. ఇంకా అవసరమైన వాటిని రైతాంగానికి ఇచ్చేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక చేసింది. సాంబమసూరి, శ్రీకాకుళం సన్నాలు, మార్టేరు 7029 (స్వర్ణ), ఇంద్ర వంటి రకాలు పంపిణీ చేయనున్నారు. వీటిపై కేజీ విత్తనాలకు రూ.10 రాయితీ ఇవ్వనున్నారు. ఇప్పటికే ఏపీ సీడ్స్ గొడౌన్‌లో విత్తనాలు అందుబాటులో ఉంచనున్నారు. త్వరలోనే రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించనున్నామని అధికారులు చెబుతున్నారు. అనంతరం ఆర్బీకేల వద్దనే రైతులకు విత్తనాలు అందించనున్నారు. ఇప్పటికే మండలంలో రైతుల కోసం 70 క్వింటాళ్ల జీలుగు, 30 క్వింటాళ్ల కట్టిజనుము విత్తనాలను 50 శాతం రాయితీపై ఆర్బీకేల వద్ద పంపిణీ చేస్తున్నారు.

వాతావరణం..

అరచేతిలో సమాచారం

- వాతావరణ మార్పులను సూచిస్తున్న యాప్‌లు
- స్మార్ట్‌ఫోన్లకు వర్షం, పిడుగుల సమాచారం



ఇచ్ఛాపురం రూరల్ : ఒకప్పుడు వాతావరణ సమాచారం కోసం టీవీలు, రేడియోలు, పత్రికలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, అరచేతిలో ఇమిడే ఆండ్రాయిడ్ ఫోన్లతో ఎంచక్కా.. ఎప్పుడు కావాలంటే అప్పుడు వాతావరణంలో మార్పులు తెలుసుకునే సౌకర్యం లభించింది. ఏపీ విపత్తుల సంస్థ 'జేడీ-ఎన్డీఎంఏఈ డబ్ల్యూ' పేరుతో, భారత వాతావరణ శాఖలు ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులపై మెసేజ్‌లు, అలారంతో హెచ్చరికలు చేస్తుంటాయి. దీంతో పాటు ప్రత్యేకంగా కేటాయించిన యాప్‌లపై ఒక్క క్లిక్‌తో రాగల 24 గంటల్లో వర్షం పడే సూచనలున్నాయా..?, పిడుగులు ఏ ప్రాంతంలో పడే అవకాశం ఉందన్న విషయాన్ని కూడా గుర్తించవచ్చు. స్మార్ట్‌ఫోన్లలోని గూగుల్ ప్లేస్టోర్ నుంచి వజ్రపాత్, విండీ, మేఘదూత్, రెయిన్ అలారం వంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే ఈ వివరాలను తెలుసుకోవచ్చు. అందుకనుగుణంగా పనుల్లో మార్పులు, చేర్పులు చేసుకొనే వెసులుబాటు లభించనుంది. ముఖ్యంగా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో శ్రమించే రైతులకు, ఇంకా పశు పోషకులకు, కోళ్లఫారం నిర్వాహకులు, ఇతర వ్యాపారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వర్షాలు వచ్చిన సమయంలో పిడుగులు పడే అవకాశాలు అధికంగా ఉంటాయి. మనుషులు, మూగజీవాలు ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటాయి. ముందస్తుగా సమాచారం తెలుసుకుంటే అప్రమత్తమై సురక్షిత ప్రాంతాల్లో ఉండొచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుబాటులోకి తీసుకొచ్చిన వివిధ యాప్‌లపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఎంతో ఉపయోగం కలగనుంది.

యాప్‌లు.. ఉపయోగాలు:



విండీ: వర్షాలు పడే అవకాశం తెలుసుకోవచ్చు. నీలం రంగు ఉంటే తీవ్రత అధికంగా భావించాలి. మూడు లైన్లు క్లిక్ చేస్తే ఏ ప్రాంతంలో వర్షం కురుస్తుందో తెలుసుకోవచ్చు.

వజ్రపాత్: దీని ద్వారా మన సమీపంలో పిడుగులు పడే విషయాన్ని గుర్తించవచ్చు. 30 నుంచి 50 కిలోమీటర్ల వరకు జరిగే వాతావరణ మార్పులను తెలుపుతుంది.

మేఘదూత్: మేఘావృతం, గాలుల తీవ్రత, వాతావరణ మార్పులను సూచిస్తుంది.

రెయిన్ అలారం: 20 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వర్షం పడే అవకాశం ఉందో చెబుతుంది. ఉష్ణోగ్రత ప్రభావాన్ని చూపిస్తుంది.

సమగ్ర సమాచారం



వాతావరణానికి సంబంధించి తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు యాప్‌ల ద్వారా తెలుసుకోవడం అలవాటు చేసుకుంటే మంచిది. ముఖ్యంగా కోళ్లఫారం, మేకలు, గొర్రెల మందల యజమానులు ముందస్తు సమాచారాన్ని తెలుసుకొని వాటిని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణం, పంట పొలాల్లో పనులు చేసుకునే సమయాల్లో ఈ సమాచారం మరింత ఉపయోగకరం. స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్న వారిని ఏపీ విపత్తుల సంస్థ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంది.

– దూగాన చిరంజీవులు, రిటైర్డ్ అడిషనల్ చీఫ్ జడ్జి, సోంపేట

కొరాపుట్‌లో పుంజుకున్న కాంగ్రెస్



తారాప్రసాద్ బాహిణీపతి



రామచంద్ర కడమ్



పవిత్ర శాంత



రఘురాం మచ్చ



రూపు బోత్ర

జయపురం: కొరాపుట్ జిల్లాలో 2019 ఎన్నికల ఫలితాలతో పోల్చితే కాంగ్రెస్ పుంజుకుంది. అలాగే బీజేడీ రెండు స్థానాలతో ఖాతా తెరిచింది. ఇంతవరకు ఓట్ల లెక్కింపులో జయపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి హ్యాట్రిక్ వైపు దూసుకుపోతున్నారు. లక్ష్మీపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి 20,299 ఓట్ల మెజారిటీతో గెలిపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి పవిత్ర శాంతకు 58,741 ఓట్లు రాగా, సమీప బీజేడీ అభ్యర్థి ప్రభుజానికి 37,819 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కైలాస కులసికకి 23,315 ఓట్లు వచ్చాయి. జయపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి, బీజేడీ అభ్యర్థి ఇందిరా నందో కంటే 10,274 ఓట్ల ఆధిక్యతలో ఉన్నారు. అలాగే కొరాపుట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి రఘురాం మచ్చ తన సమీప బీజేడీ అభ్యర్థి రఘురాం పడాల్‌పై 2,338 ఓట్ల మెజారిటీతో గెలిపొందారు. కోట్‌పాడ్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి రూప భొత్ర 23వ రౌండ్ ముగిసేసరికి తన సమీప బీజేడీ అభ్యర్థి చంద్రశేఖర మఝిపై 27,863 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. పొట్టంగి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్ర కడమ్ తన సమీప బీజేడీ అభ్యర్థి ప్రఫుల్లకుమార్ పంగిపై 1,907 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించినట్లు సమాచారం.

కొరాపుట్‌లో కాంగ్రెస్ ఘన విజయం..?



సప్తగిరి శంకర ఉల్కా

జయపురం: ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట అయినటువంటి కొరాపుట్‌లో ఆ పార్టీ అభ్యర్థి సప్తగిరి శంకర ఉల్కా రెండోసారి విజయ కేతనం ఎగురవేస్తున్నారు. ఆయన మొదటి రౌండ్ నుంచి తన సమీప బీజేడీ, బీజేపీ అభ్యర్థులపై ఆధిక్యత కనబర్చారు. 19వ రౌండ్ ముగిసేసరికి ఆయన తన సమీప ప్రత్యర్థి కంటే 16,403 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయనకు 77,075, ఓట్లు రాగా, తన సమీప బీజేడీ అభ్యర్థి కౌశల్య హికాకకు 60,672, ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి కాళీరాం మఝికి 37,558 ఓట్లు వచ్చాయి.

బరంపురంలో ఎంపీ స్థానంలో బీజేపీ ఆధిక్యత



ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: బరంపురం పార్లమెంటరీ స్థానంలో ఏడు నియోజకవర్గాలు ఉండగా, వాటిలో గజపతి జిల్లా మోహనా సెగ్మెంట్స్‌లో 30వ రౌండు ముగిసేసరికి బీజేపీ అభ్యర్థి ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి 65,439 ఓట్లు సాధించి, తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి రస్మిరంజన్ పట్నాయిక్‌పై 2,238 ఓట్లు పైచిలుకు ఆధిక్యతలో ఉన్నారు. పర్లాకిమిడి నియోజకవర్గంలోనూ ఆధిక్యత కనబరుస్తున్నారు. కడపటి వార్తలు అందేసరికి కౌంటింగ్ కొనసాగుతోంది.

ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్



రెడ్‌జోన్ పరిధిలో పోలీసు బందోబస్తు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. కౌంటింగ్ జరిగిన ఎచ్చెర్ల మండలం చిలకపాలెం శివానీ కళాశాల పరిధి రెండు కిలోమీటర్ల మేర రెడ్ జోన్ ఉండటం.. 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉండి మూడంచెల పటిష్ఠ భద్రత, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పరిసర ప్రాంతాల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగలేదు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు తమ గుర్తింపు పత్రాలను చూపించనిదే పోలీసులు లోపలికి అనుమతించలేదు. జిల్లావ్యాప్తంగా ఎక్కడా అల్లర్లు గానీ, హింసాత్మక ఘటనలు కానీ చోటుచేసుకోలేదని, శాంతిభద్రతలు అదుపుతప్పలేదంటూ ఎస్పీ జి.ఆర్.రాధిక ప్రకటించారు. కౌంటింగ్ ప్రక్రియ జరిగే ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ప్రశాంత వాతావరణంలో, సజావుగా జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికల అంకం ముగిసిందని, సహకరించిన జిల్లా ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు ఎస్పీ తెలిపారు.

డిపాజిట్లు కోల్పోయిన స్వతంత్రులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసినవారంతా కనీసం ప్రభావం చూపకుండానే చతికిలబడ్డారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో ఒక్క స్వతంత్ర అభ్యర్థి కూడా పోటీచేయలేదు. గతంలో స్వతంత్రులుగా బరిలో దిగి శాసన సభ్యులుగా ఎన్నికైన చరిత్ర ఉంది. 1952లో టెక్కలి నుంచి ఆర్.ఎల్.ఎన్ దొర, 1972లో శ్రీకాకుళం నుంచి చల్ల లక్ష్మీనారాయణ, 1978లో ఆమదాలవలస నుంచి పైడి శ్రీరామ్మూర్తి, 1989లో టెక్కలి నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు, పలాస నుంచి గౌతు శివాజీలు స్వతంత్రులుగానే గెలుపొందిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఎవరైనా స్వతంత్రులుగా బరిలో దిగితే ప్రధాన అభ్యర్థులు ఆందోళనకు గురయ్యేవారు. గత రెండు, మూడు ఎన్నికల నుంచి స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం నామమాత్రంగానే ఉంటోంది. మరోవైపు ఎంపీ అభ్యర్థులుగా ఐదుగురు పోటీ చేసినా ఏ ఒక్కరికి ధరావతు రాలేదు. ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేసినా ఏ ఒక్కరికి కనీస ఓట్లు రాకుండానే మిగిలిపోయారు.

శ్రీకాకుళం ఎంపీ ఇండిపెండెంట్

అభ్యర్థులు	ఓట్లు
చెల్లూరి డానియేల్	796
సనపల శ్రావణకుమార్	5960
వాబయోగి	3472
బేతా వివేకానంద	2523
ఎద్దు లక్ష్మీనారాయణ	1598

ఆమదాలవలస నియోజకవర్గం

గణపతి జగదీశ్వరరావు	546
గాంధీ సువ్వారి	9537
ముద్దాడ రాంబుజ్జి	166
ఎల్.వి.రాజశేఖర్	474
సనపల సురేష్‌కుమార్	386

పలాస నియోజకవర్గం

కర్ని వెంకటరమణ	142
తెలగవలస జయరాం	322
డి.వీరాస్వామి	357

నరసన్నపేట నియోజకవర్గం

బోర వెంకట సత్యేంద్రనాథ్ అభిషేక్	332
మైలపల్లి జగదీష్	291

పాతపట్నం నియోజకవర్గం

అసపన్న శంకరరావు	113
కోయ్యాన గోవిందరావు	241
బగ్గు కృష్ణ	320
ఆర్.మోహనరావు	592

ఎచ్చెర్ల నియోజకవర్గం

ఎస్.ఈశ్వరరావు	601
గొర్లె కిరణ్‌కుమార్	303
గొర్లె రాంబాబు	679
సువ్వారి రమ్య	839

టెక్కలి నియోజకవర్గం

అట్టాడ రాజేష్	614
గెడ్డవలస రాము	482

ఇచ్ఛాపురం నియోజకవర్గం

మురపాల లక్ష్మి	208
సుగ్గు చక్రవర్తి	274
సూర్యవరప్రసాదరావు జన్నెల	728

పోటెత్తిన భక్తులు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు కూడా చేశారు.

క్లుప్తంగా

గాయపడిన మరో యువతి మృతి



మృతిచెందిన లక్ష్మి (ఫైల్)

సీతంపేట: కొద్ది రోజుల కిందట సీతంపేట మండలంలోని వంబరెల్లి లోయలో ఆటో బోల్తా పడిన సంఘటనలో గాయపడిన మరో యువతి సవర లక్ష్మి (23) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఇప్పటికి ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందడంతో వంబరెల్లి, బుడ్డడుగూడ తదితర గ్రామాల్లో విషాద చాయలు అలుముకున్నాయి. మృతురాలు లక్ష్మికి ఇంకా వివాహం కాలేదు. తండ్రి మంగయ్య కొన్నేళ్ల క్రితం మరణించగా తల్లి బూదమ్మ కూలీనాలీ చేసుకుంటూ కుమార్తె, కుమారుడిని పెంచుతోంది. ఇంటికి పెద్ద దిక్కైన కుమార్తె మృతితో గుండె లవిసేలా ఆ తల్లి రోదిస్తోంది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు 25 గొర్రెల మృతి



వంగర: పిడుగుపాటుకు మృతిచెందిన గొర్రెలు

వంగర: మండల పరిధి నీలయ్యవలస గ్రామ సమీపంలో పిడుగు పడి 25 గొర్రెలు మృతిచెందాయి. బలిజిపేట మండలం చినగలావిల్లికి చెందిన గొర్రెల కాపరి ముగడ అప్పన్న.. నీలయ్యవలస సమీపంలో గొర్రెల మేతకు తీసుకువచ్చాడు. మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పిడుగులు పడడంతో అక్కడికక్కడే 25గొర్రెలు మృతి చెందాయి. దీంతో తమను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.


పిడుగుపాటు మరో మూడు ఆవులు



సంతకవిటి : వాసుదేవపట్నం పొలాల్లో పిడుగుపాటుకు గురై మృతిచెందిన ఆవు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం గ్రామం వద్ద పిడుగుపాటుకు గురై మూడు ఆవులు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే పొలాల్లో మేత నిమిత్తం గ్రామానికి చెందిన రైతులు ఆవులను విడిచిపెట్టారు. ఉన్నపళంగా మేఘాలు ఏర్పడి ఉరుములు, మెరుపులతో కూడిన మేఘాలు ఏర్పడడంతో పాటు ఆవులు ఉన్న ప్రాంతంలో ఒక పిడుగుపడడంతో గ్రామానికి చెందిన మొదలవలస కమల, మజ్జాడ సత్యం, కోడిపీతల శ్రీనులకు చెందిన మూడు పాడిఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. పాలిచ్చే ఆవులు మృతి చెందడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. పాడి ఆవులు మృతి చెందిన విషయాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులకు చేరవేశారు.

నేలకొరిగిన మినీ ట్రాన్స్‌ఫార్మర్



గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్

బలిజిపేట: మండలంలోని గలావల్లి పంచాయతీ పరిధి కె.గలావల్లి గ్రామంలో గాలి, వాన, పిడుగుల ప్రభావంతో మినీ ట్రాన్స్‌ఫార్మర్ నేలకొరిగింది. మంగళవారం సాయంత్రం ఉరుములు, పిడుగులు, గాలి, వాన బీభత్సం సృష్టించడంతో ప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. మినీ ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయని వెంటనే అధికారులు చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు.

రక్తదానం ప్రాణదానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానమని రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం అన్నారు. స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తందానం చేసి ప్రాణాలు కాపాడగలడని అన్నారు. నిరంతరం రక్తదాన శిబిరాలు నిర్వహించడం ద్వారా రక్త కొరత లేకుండా చూడవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైద్యుడు వేణుగోపాల్ రెడ్డి, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ గౌరీశంకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంపై చైతన్యం



ఇటువంటి ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన అవసరం

- విద్యార్థి దశ నుంచే అవగాహన
- 5 నుంచి 19 వరకు పాఠశాలల్లో కార్యక్రమం

రాజాం సిటీ: సమాజంలో ఆధునికత పెరుగుతున్న కొద్దీ మనుషుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విలాసవంతమైన జీవనాన్ని గడుపుతూ ఇష్టానుసారం ప్రకృతిని పాడు చేయడంతో నింగి, నేల, గాలి కలుషితమవుతున్నా యి. ఒక వైపు ప్లాస్టిక్ వ్యర్థాలు, మరో వైపు మందుల తయారీ, చెట్ల నరికివేతతో వాతావరణ కాలుష్యంతో భూతాపం రోజురోజుకు పెరిగి సకాలంలో వర్షాలు కురవకపోవడం, విపత్తులు సంభవించడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ పరిధి వరకు భూమిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఐక్యరాజ్య సమితి అనుబంధంగా ఇంటర్ ప్యానల్ ఇన్ క్లైమేట్ చేంజ్ (ఐపీసీసీ) పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది. జూన్ 5న ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. అందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను చైతన్యం చేసేందుకు పొల్యూషన్ బోర్డు, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఈ నెల 5 నుంచి 19 వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది.

షెడ్యూల్ ఇలా..

5వ తేదీన పాఠశాలల్లో ప్లాస్టిక్‌ను ఉపయోగించకూడదని చెప్పే కార్యక్రమాలు నిర్వహించడం. పర్యావరణ అనుకూల వస్తువులు వాడడం, ప్లాస్టిక్ వస్తువుల సంఖ్య నోట్ చేయడం, ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా పోస్టర్లు, జూట్ వస్తువులు, గుడ్డ సంచుల వాడకం, పర్యావరణ సానుకూల అలవాట్లు పెంపొందించడం వంటి కార్యక్రమాలపై అవగాహన చేపట్టాలి.

- 12న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో పాఠశాలల్లో నీటి లీకేజీని అరికట్టడం, పైపుల లీకేజీని తనిఖీ చేయడం, నీటి స్వచ్ఛత పరీక్షల నిర్వహణ, నీటి సంరక్షణ ర్యాలీ, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి.
- 13న విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఎనర్జీ సేవింగ్ యాక్టివిటీస్, ఎనర్జీ టీమ్, ఎకో క్లబ్ ఎనర్జీ టీమ్‌తో డ్యూటీ రోస్టర్, నాలెడ్జ్ బిల్డింగ్ సెషన్లు, పోస్టర్లు, బ్యానర్లు, ఇతర విజువల్ మెటీరియల్ తయారుచేయడం, డిస్‌ప్లే బోర్డులు పోస్టుచేయడం వంటి కార్యక్రమాలు చేపడతారు.
- 14న పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరుచేయడం, తరగతి గదుల్లో రెండు బిన్‌ల వ్యవస్థ, శానిటరీ వ్యర్థాలు, కంపోస్టు పిట్లు, వస్త్రాలు, బొమ్మలు వంటి వివరాలతో డ్రైవ్‌లు నిర్వహించడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం.
- 15న పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో వ్యర్థాలను సేకరించడం, భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- 18న కిచెన్ గార్డెన్‌లను అభివృద్ధి చేయడం, ప్లాస్టిక్ సీసాలు మొదలైన అందుబాటులో ఉన్న పదార్థాలను ఉపయోగించడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువులు, మొక్క పెరుగుదల ఉత్పత్తి రికార్డు నిర్వహించడం, పర్యావరణ ప్రయోజనాల గురించి చర్చించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు.
- 19న నేచర్ వాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భౌగోళిక ఆచారాలు, సంప్రదాయాలను పరిశీలించడానికి సమీప గ్రామాల అన్వేషణ, సందర్శనలు వంటి కార్యక్రమాలు

అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి



పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహించాలి. షెడ్యూల్ ప్రకారం ఆయా తేదీలలో ఆయా పాఠశాలల్లో కార్యక్రమాలు చేపట్టాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు ఆయా డిపార్ట్‌మెంట్ అధికారుల సమన్వయంతో అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

– ఎంవీ ప్రసాదరావు, ఎంఈఓ, రేగిడి మండలం

తమ్ముడ్ని కడతేర్చిన అన్న



కాలనీలో సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కె రవికుమార్



ఎస్ఐ ముందు రోదిస్తున్న మృతుడి కుటుంబీకులు



హేమంత్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని పెదభోగిలి హడ్కో కాలనీలో మంగళవారం సాయంత్రం సొంత తమ్ముడు గుజ్జల హేమంత్(42)ను అన్న గుజ్జల రవీంద్రకుమార్ కడతేర్చాడు. ఈ హత్య ఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుజ్జల రవీంద్ర కుమార్, హేమంత్ అన్నదమ్ములు, తన ఇంటి సమీపంలోనే ఉన్న అన్న రవీంద్రకుమార్ ఇంట్లో హేమంతకుమార్ కలపను భద్రపరిచాడు. కలప పోతుందని ఇంటి పనిచేసి తీసుకెళ్లాలంటూ అన్న దమ్ముల మధ్య రెండు రోజులుగా గొడవ జరుగుతోంది. అయినా తమ్ముడు హేమంత్ కలప తరలించక పోవడంతో మంగళవారం మాటామాటా పెరగడం కొట్లాటకు దారితీసింది. దీంతో సమీపంలో ఇంటివద్ద పూలు కటింగ్ చేసే కత్తితో రవీంద్ర కుమార్ గొంతులోంచి గాయపర్చడంతో హేమంత్ సంఘటనా స్థలంలో కుప్పకూలిపోయాడు. వెంటనే హేమంత్‌ను నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చేరే సమయానికి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సంఘటన తెలుసుకున్న పార్వతీపురం రూరల్ సీఐ కె రవికుమార్ హత్య జరిగిన సంఘటనా స్థలంలో పరిశీలించి, మృతుడి నివాసానికి వెళ్లి హత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడి భార్య ఆశాజ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన అదనపు డీజీ



భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అదనపు డీజీ (ఆపరేషన్స్) రాజీవ్‌కుమార్ మీనా

విజయనగరం టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహించే లెండి ఇంజినీరింగ్ కళాశాలను అదనపు డీజీ(ఆపరేషన్స్) రాజీవ్ కుమార్ మీనా మంగళవారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద జిల్లా పోలీసు శాఖ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎం.దీపిక అయనకు వివరించారు. అదేవిధంగా విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ ఎం.జావళి అల్ఫాన్స్, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఐఆర్ఎస్ అధికారి సౌమ్య



సౌమ్య దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఐఆర్ఎస్ అధికారి నూతలపాటి సౌమ్య మంగళవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో పూజలు తర్వాత ఆలయ విశిష్టతను శంకరశర్మ వివరించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలను ఉన్నతాధికారికి అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం విష్ణుచక్రం గ్రామానికి చెందిన జనపాన చిన్నారావు(37) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నారావు సోమవారం రాత్రి మద్యం సీసాలు నడుము వద్ద పెట్టుకుని వెళ్తుండగా రావివలస గ్రామ సమీప జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన సంగతి తెలిసిందే. వెంటనే టెక్కలి జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారావుకు భార్య కమల, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వేసవి తాపం తీర్చే తాటిముంజులు



పెద్దచెరువు గట్టు వాలు రోడ్డుపై తాటిముంజుల విక్రయాలు

వందగ్రాములు తాటిముంజుల నుంచి అందే పోషకాలివే	
నీరు	87.6 గ్రాములు
శక్తి	43 క్యాలరీలు
పీచు	1 గ్రాము
పిండి పదార్థాలు	10.9 గ్రాములు
కొవ్వులు	0.1 గ్రాము
ప్రొటీన్లు	0.8 గ్రాములు
కాల్షియం	27 మిల్లీగ్రాములు
ఫాస్పరస్	30 మిల్లీగ్రాములు
మెగ్నీషియం	10 మిల్లీగ్రాములు
సోడియం	20 మిల్లీగ్రాములు
పొటాషియం	150మిల్లీగ్రాములు
విటమిన్-సి	5 మిల్లీగ్రాములు

విజయనగరం అర్బన్: వేసవి వచ్చిందంటే గుర్తుకొచ్చే వాటిలో తాటి ముంజులు ముందువరుసలో ఉంటాయి. ప్రతి ఒక్కరూ ఇష్టపడి తినే వాటిలో ఇవి ఉన్నాయి. శరీరాన్ని చల్లబరిచే గుణం ఉండడంతో పిల్లల నుంచి పెద్దల వరకూ ఇష్టపడతారు. ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు ఇవి తీసుకుంటే శరీ రాన్ని డీహైడ్రేషన్ బారి నుంచి కాపాడుతుందని వారి నమ్మకం. ఓ మోస్తరు వర్షం కురుస్తున్నా..వేడి తగ్గకపోవడంతో తాటి ముంజులు కొనేందుకు జనం ఎగబడుతున్నారు. పల్లెల నుంచి పెద్ద ఎత్తున తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నారు. జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. వేడిసెగలు తగ్గడం లేదు. జనం ఇంకా ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. వేసవితాపం నుంచి సేదదీరేందుకు తాటి ముంజులను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో పల్లెల నుంచి వచ్చి తాటిముంజులు అమ్ముకునే వారి సంఖ్య పట్ట ణంలో పెరిగింది. కొద్దిరోజులుగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఆటోల్లో తాటికాయలు తీసుకువచ్చి స్థానిక పెద్దచెరువు గట్టు వాలులో రోడ్డుపై అధిక సంఖ్యలో వీటి అమ్మకాలు పెరిగాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, జాతీయ రహదారిపై విక్రయి స్తున్నారు. డజన్ తాటి ముంజుల ధర రూ.50 నుంచి రూ.60 పలుకుతోంది. రోజుకు 50 నుంచి 70 ముంజులు వరకూ అమ్ముతున్నట్లు విక్రయదారులు చెబుతున్నారు. వాటితో శారీరక ఆరోగ్యకరమైన అనేక లాభాలున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తాటి ముంజులతో లాభాలివే..

- తాటి ముంజుల్లో అధికశాతం తేమ ఉండడంతో శరీర ఉష్ణోగ్రత తగ్గిస్తుంది.
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ కాల్షియం, ప్రోటీన్లు, ఐరన్, ఇతర విటమిన్లు ఉంటాయి.
- వేడిమితో బాధపడేవారంతా ఇవి తీసుకుంటే డీహైడ్రేషన్ నుంచి రక్షిస్తుంది.
- ఎసిడిటీ, మలబద్ధకం, అల్సర్ సమస్యలను నివారిస్తూనే జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.
- వేసవిలో దద్దుర్లు, అలర్జీ వస్తుంటుంది. ముంజులు తిన్నా, గుజ్జును రాసుకున్నా చర్మం పొడిబారే సమస్యను నివారిస్తారు.

• మట్టితో కళాకృతులు



మట్టిబొమ్మల తయారీలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: మట్టితో అందమైన కళాకృతులను తయారు చేసే విధానంపై డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం ఆయన మట్టితో దేవతా విగ్రహాలు, అందమైన కళాకృతులు, వంటపాత్రలు తయారు చేయడంలో శిక్షణ అందించారు. అనంతరం ఈ బొమ్మల తయారీపై పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి బి. గణేష్‌బాబు మాట్లాడుతూ పుస్తకాలు మంచి నేస్తాలని, విద్యార్థులు పుస్తక పఠనంతో మేధస్సును పెంచుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా గ్రంథాలయాలకు రావాలని పిలుపునిచ్చారు.

గానగంధర్వుడికి ఘనంగా నివాళి



బాల సుబ్రహ్మణ్యం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పలువురు ఘనంగా నివాళి అర్పించారు. సహాయ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గరివిడి పట్టణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావుతో పాటు పలువురు బాలసుబ్రహ్మణ్యం విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో సహాయ్ సంస్థ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివా సరావు, గణేశ్వరరావు, బలగ అప్పారావు, సరిది రాంబాబు, బ్రహ్మాజీ, కిరణ్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



అంపోలు నాగ ఉష శ్రీ



ఉత్తరావల్లి సింధుజ



పైల సాయిలక్ష్మి

విజయనగరం అర్బన్: వైద్యకళాశాలల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్-2024 ప్రవేశ పరీక్షలో జిల్లా విద్యార్థులు పలువురు ర్యాంక్‌లు సాధించారు. జాతీయ స్థాయిలో 24 లక్షల మంది రాసిన ప్రవేశ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన అంపోలు నాగ ఉష శ్రీ ఆలిండియా స్థాయిలో 80,638వ ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో 38,082వ ర్యాంక్ సాధించింది. మొత్తం 700 మార్కులకు గాను 600 మార్కులు తెచ్చుకుని ఈ ర్యాంక్ తెచ్చుకుంది. ఉషశ్రీ తండ్రి కుసుమన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, తల్లి సునీత గృహిణి. అదే విధంగా పట్టణంలోని ఉత్తరావల్లి సింధుజకు 531 మార్కులతో జాతీయస్థాయిలో 1,65,543 ర్యాంక్, ఎస్సీ కేటగిరిలో 8859 వ ర్యాంక్ లభించింది. సింధుజ తండ్రి రామారావు బాడంగి జిల్లా పరిషత్ స్కూల్ టీచర్, తల్లి రమాదేవి గృహిణి.

సాయిలక్ష్మి సత్తా

రాజాం: పట్టణానికి చెందిన పైల సాయిలక్ష్మి నీట్ ఫలితాల్లో సత్తాచాటింది. 590 మార్కులు సాధించి 43 వేల ర్యాంకును కైవసం చేసుకుంది. ఆమె తండ్రి వేణుగోపాలరావు చిరువ్యాపారి కాగా, తల్లి చందన గృహిణి. ఆమె ఓ ప్రైవేట్ కళాశాల్లో ఇంటర్మీడియట్ చదివి బైపీసీ గ్రూపులో 925 మార్కులు సాధించింది. నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకును సాధించిన సాయిలక్ష్మిని పలువురు అభినందించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న చదురుగుడి పైడితల్లి అమ్మవారు



వనంగుడిలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్ల పూడి ధనుంజయ్, మూలాపాపారావు, నేతేటిప్రశాంత్‌లు విశిష్ట కుంకుమా ర్చన చేశారు. వివిధ రకాల స్వీట్లతో అమ్మవారికి నివేదన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

ఆర్టీసీలో రాయితీ పాసుల వెబ్‌సైట్ అప్‌గ్రేడ్

విజయనగరం అర్బన్: నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఆర్టీసీ ఇచ్చే రాయితీ పాసుల కోసం పాత వెబ్‌సైట్‌లో కొత్తది అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు విజయనగరం ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎంఎస్‌టీ పాసులపై తిరిగే విద్యార్థులకు పాసుల మంజూరు మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైట్‌ను అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. ఈ వెబ్‌సైట్ 6, 7వ తేదీలలో వెబ్‌సైట్ పనిచేయదని, 8వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్‌ల జారీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

కొత్త విద్యాసంవత్సరానికి ఈ నెల 12వ తేదీ నుంచి యథావిధిగా నూతన బస్‌పాసులు జారీ చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. విద్యార్థి చదువుతున్న విద్యాసంస్థ నుంచి స్టడీ సర్టిఫికెట్ బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, 10వ తరగతి సర్టిఫికెట్ జిరాక్స్ తీసుకుని 'ఆన్‌లైన్ఏపీఎస్ఆర్‌టీసీపాస్.ఐఎన్' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లై చేసుకుని విజయనగరం బస్‌స్టేషన్‌లో గల బస్‌పాస్ కౌంటర్ వద్దకు వచ్చినట్లయితే వెంటనే బస్‌పాస్ జారీ చేస్తామని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్యారమ్ బోర్డు ఆడుతున్న విద్యార్థులు

రామభద్రపురం: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని లైబ్రేరియన్ సత్యవాణి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయానికి మంగళవారం విచ్చేసిన విద్యార్థులకు తెలుగు, గణితం, విజ్ఞానశాస్త్రం అంశాలతో పాటు చిత్రలేఖనం, వక్తృత్వం, క్రాఫ్ట్ వర్క్, స్పోకెన్ ఇంగ్లిష్, చదరంగం, క్యారమ్ బోర్డు ఆట వంటి వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. పిల్లలను వ్యక్తిత్వ వికాసం వైపు మళ్లించడం, పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చాలన్న సదుద్దేశ్యంతోనే ఈ వేసవి శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కవ్వింపు చర్యలకు పాల్పడవద్దు

జియ్యమ్మవలస: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరూ కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని గుమ్మలక్ష్మీపురం సీఐ సత్యనారాయణ సూచించారు. పెదమేరంగి కూడలిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పహారా చేపట్టారు. ఎవరు గెలిచినా ఒకేలా స్పందించే తీరును కనబరచాలని, ఏ ఒక్కరూ ఒకరికొకరు దుర్భాషలాడడం గానీ వివాదాస్పద వ్యాఖ్యలు చేసుకోవడం గానీ చేయవద్దన్నారు.

ప్రతిఒక్కరూ సంయమనం పాటించాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించాలని కోరారు.